క్లుప్తంగా

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు శుక్రవారం సీఎం కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 16ఏళ్లుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న 567 మందిని క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఆమోదం తెలపడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంటాక్ట్ ఉపాధ్యాయులు ప్రవీణ్‌మార్, ఫణిందర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యంగా పనిచేస్తే కాంగ్రెస్‌దే విజయం'


మాట్లాడుతున్న సురేశ్‌షెట్కార్

నారాయణఖేడ్: కార్యకర్తలందరూ ఏకమై కలసికట్టుగా పనిచేస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్‌షెట్కార్ అన్నారు. ఖేడ్‌లోని మా ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం దివంగత మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, రశీద్, భోజిరెడ్డి, అడివిరెడ్డి, సాగర్‌షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఉత్తరప్రదేశ్‌లోని లక్నో ఎమ్మెల్సీ అవినాష్‌కుమార్ పాటిల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో నిర్వహించిన ప్రవాస యోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంబదాస్, నాయకులు సత్యనారాయణ, బ్రహ్మానందరెడ్డి, రాములు, సారా కృష్ణ, సుధాకర్, హరీష్, మోహన్‌డ్డి పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం

జహీరాబాద్ టౌన్: కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అన్నారు. మండలంలోని బూచినెల్లి ముస్కో పరిశ్రమ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులను పరిరక్షణతో పాటు సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అనంతరం కర్మాగారం సీఐటీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సలహాదారులుగా చుక్కరాములు, గౌరవ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, అధ్యక్షుడిగా మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహిపాల్, ఉపాధ్యక్షులుగా మధుకర్, మహబూబ్ పాష, ప్రధాన కార్యదర్శిగా సందీప్, కార్యదర్శులుగా నాగేష్, దేవిదాస్, వీరశెట్టి, అనిల్, కోశాధికారిగా బాగేందర్ ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మె

కొండాపూర్(సంగారెడ్డి): సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని చేపట్టిన సమ్మె శుక్రవారంతో పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీ మాట్లాడుతూ 10 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, మమత, శాంత, మంజుల, రోజి, మేఘన, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి కార్మికులను పర్మినెంట్ చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని జిల్లా ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, శానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్‌కు సరైన వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రతి కార్మికుడికి రూ.15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు యాదగిరి, యాదయ్య, శ్రీకాంత్, కిరణ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్


చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న పట్టణ స్వర్ణకారుల సంఘం నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ఆశీర్వదిస్తే అండగా ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు శుక్రవారం చింతా ప్రభాకర్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మరోసారి హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు గడీల సుధీర్‌రెడ్డి, కౌన్సిలర్ ఇంద్రమోహన్‌గౌడ్, పట్టణ స్వర్ణకారుల సంఘం నాయకులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న ఆయుష్ తన్వీర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలతో కలిసి డాక్టర్ తన్వీర్ శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి చింతా ప్రభాకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్, విజయలక్ష్మి, శేఖర్, అజ్జూ, గోవింద్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో చింతా ప్రభాకర్

ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలి

పటాన్‌చెరు టౌన్: 18 ఏళ్లుగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పారితోషకం రూపంలో ఆశలకు రూ.9750 మాత్రమే ఇస్తున్నారన్నారు. అదే విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గీత, హైమావతి, లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వట్‌పల్లి (అందోల్): ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జోగిపేట, వట్‌పల్లి తహసీల్దారు కార్యలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభ కరపత్రాల ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: ఈ నెల 27న సంగారెడ్డిలో నిర్వహించనున్న ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని బహుజన సంఘాల జిల్లా నాయకుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్మరణ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ అట్టడుగువర్గాలకు అండగా తన మాటలు, పాటలతో ప్రజలను చైతన్యపరుస్తూ అలుపెరగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, వసంత్ కొడి, వెంకటయ్య, మొగులయ్య, అశోక్ పాల్గొన్నారు.

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా గార్డెన్‌ ఈ నెల 27న నిర్వహించనున్న ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ బహుజన ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జగన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అనంతయ్య, దుర్గప్రసాద్, విజయరావు, మురారి, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘంలో చీలిక


చిట్కుల్ గ్రామంలో నీలం మధుకు మద్దతు ప్రకటిస్తున్న ముదిరాజ్‌లు


ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్న చిట్కూరు గ్రామ ముదిరాజ్‌లు

- నీలం మధుకు మద్దతునిస్తూ చిట్కుల్ గ్రామ ముదిరాజ్ సంఘం నాయకుల తీర్మానం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వైపే ఉంటామని మరికొందరి మద్దతు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్‌కే టికెట్ కేటాయించాలని మద్దతు ప్రకటిస్తూ తీర్మానాలు చేయడానికి సిద్ధమవుతున్నామని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గారెల శ్రీను ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్ గ్రామంలో కొందరు ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం నీలం మధుకు మద్దతిస్తూ తీర్మానం చేశారు. సీఎం కేసీఆర్ మరొకసారి పటాన్‌చెరు నియోజకవర్గ టికెట్‌పై పునరాలోచించాలని కోరారు. నాయకులు మన్నే చంద్రయ్య, తలారి నాగేష్, ఉప్పరి నర్సింహులు, దుబ్బ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసిన మరికొందరు..

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చిట్కుల్ గ్రామానికి చెందిన కొందరు ముదిరాజ్‌లు ప్రకటించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న రాములు, వార్డుసభ్యులు తలారి ఆంజనేయులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా ఆలోచించండి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్కై రూట్ సీఈవో పవన్ ఉద్బోధ

పటాన్‌చెరు టౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎల్లవేళలా ఉన్నతంగా ఆలోచించాలని, అత్యధిక ప్రభావం చూపే సమస్యలను పరిష్కరించి సమాజం మెప్పు పొందినప్పుడు ప్రపంచ మద్దతు లభిస్తుందని స్కై రూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పవన్ చందన అన్నారు. పటాన్‌చెరులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గీతం స్మార్ట్ ఐడియా థాన్-2023 మూడో విడత పోటీల (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడారు. గతంలో స్టార్టప్లను ప్రజలు అంతగా విశ్వసించే వారు కాదని, కానీ కొన్ని విజయవంత గాథలు వింటున్న ఈ తరుణంలో వాటిపై సానుకూలత పెరిగిందన్నారు. రెండేళ్ల క్రితమే అంతరిక్ష రంగంలో పోటీపడటానికి అందరినీ కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, వచ్చే పదేళ్లలో ఆ రంగానికి మంచి భవిష్యత్ ఉంటుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గీతం స్మార్ట్ ఐడియా థాన్ విజేలతను ఆయన అభినందించారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్ మాట్లాడుతూ.. స్కై రూట్ ఆరేళ్లలో దాదాపు 500 కోట్ల రూపాయల నిధులను సమీకరించగలిగిందని చెప్పారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ గ్రెగ్ కొలియర్, ప్రొఫెసర్ రవి రామ్మూర్తి స్మార్ట్ ఐడియా థాన్-2023 ఫలితాలను వెల్లడించి, విజేతలను సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు.

బీపీ మండల్‌కు నివాళి

సంగారెడ్డి టౌన్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ 105వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీరయ్యయాదవ్ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్-1, కేంద్ర సర్వీసుల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లను కల్పించారన్నారు. మిగిలిన 39 మండల్ కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 75 కోట్ల జనాభా కలిగిన బీసీల కులగణన చేయాలని కోరారు. హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్య, విద్యార్థి నాయకుడు అఖిల్, యువజన నాయకుడు అంజద్, రఘు, ప్రేమ్, గణేష్, కార్తీక్, విఠల్, రాంరెడ్డి పాల్గొన్నారు.

గణేష్ గడ్డ ఆలయ హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించగా 66 రోజుల హుండీ రూ.13,66,927లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించమన్నారు. అదేవిధంగా అన్నదాన హుండీ ఆదాయం రూ.91,414 వేలు వచ్చిందని తెలిపారు. ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్ జగదీశ్వర్ స్వామి అయ్యప్ప సతీష్ ఆలయ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధును సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీసీబంధు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే బీసీ బంధు డబ్బుల ద్వారా స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమను సంప్రదించాలని సూచించారు. సిబ్బంది సుభాష్ పాల్గొన్నారు.

శ్రావణ శోభితం


రామచంద్రాపురంలో పూజలు చేస్తున్న భక్తులు


జహీరాబాద్‌లో..


హత్నూరలో..

శ్రావణమాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్


నారాయణఖేడ్: పూజలు చేస్తున్న భక్తులు

టికెట్ కేటాయింపుపై ధర్నా


ధర్నా చేస్తున్న ఎస్‌ఎంఆర్ యువసేన నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయింపు విషయంలో అధిష్టానం పునరాలోచించాలని డిమాండ్ చేస్తూ జిన్నారం మండలంలోని గడ్డపోతారం ప్రధాన రహదారిపై ఎస్‌ఎంఆర్ యువసేన నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ త్వరలోనే బీఆర్‌ఎస్ ముదిరాజ్‌లు రాజీనామాలు చేసి ఎమ్మెల్యేగా నీలం మధును గెలిపించుకుంటామని నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఆర్ యువసేన నాయకులు నారబోయిన శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పునరాలోచించాలి..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచించాలని అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీసీ వర్గాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం 60 లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్‌లకు ఒక ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బీసీ వర్గాలు ఏకమై ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ వర్గాల నాయకులు బాలరాజు, యాదగిరి, రాజు, పెంటేష్, యాదగిరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మాణిక్యం, రాజయ్య, లక్ష్మీ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8 నుంచి 10వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సంగారెడ్డిలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ, ప్రభుత్వ జూనియర్ విద్యాసంస్థల్లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం రద్దు చేసేవరకు పోరాటం చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు హత్యలు, అత్యాచారాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్లీనరీ సమావేశాలకు విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, రమేష్ సహాయ కార్యదర్శులు రజినీకాంత్, సాక్షి, రవి, కిరణ్‌గౌడ్, రజినీకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గుర్తించాలని కోరుతూ బొల్లారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో అధిష్టానికి దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాలసుబ్రమణ్యారెడ్డి, భార్గవ్, శ్రీనివాస్, సత్తిబాబు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నారాయణఖేడ్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఖేడ్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీకి గాను అభ్యర్థిత్వం కోసం ఖేడ్ మండలంలోని జుజాల్‌పూర్‌కు చెందిన దేవునూరి లక్ష్మణ్ గాంధీభవన్‌లో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. బీసీ కురుమ సామాజికవర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని కోరారు. శుక్రవారంతో దరఖాస్తుల ప్రక్రియ ముగియగా ఖేడ్ నుంచి కాంగ్రెస్ తరఫున ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్‌షెట్కార్, మరో ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, దేవునూరి లక్ష్మణ్ ఉన్నారు.

పటాన్‌చెరు టౌన్‌లో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి కుమారుడు పటాన్‌చెరు పట్టణానికి చెందిన మనోహర్‌రెడ్డి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని గాంధీభవన్ దరఖాస్తు సమర్పించారు. నాయకులు ధీరజ్‌రెడ్డి, డాక్టర్ ఆదిత్యరెడ్డి, సుజిత్, సిద్దార్థ, అభిషేక్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

నారాయణఖేడ్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఖేడ్‌కు చెందిన పలువురు గాయపడి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెదక్‌లో ఈ నెల 23న జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగసభకు వెళ్లి సభ అనంతరం రాత్రి ఖేడ్‌కు చెందిన కార్యకర్తలతో వస్తున్న తూఫాన్ వాహనం పెద్దశంకరంపేట సమీపంలో అదుపుతప్పి బోల్తాపడటంతో 8 మంది గాయపడ్డారు. అందులో తీవ్రంగా గాయపడి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఎమ్మెల్యే పరామర్శించి వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాములు ఉన్నారు.